ఎరువుల కొరత .. రైతుల కలత

ఖరీఫ్ సీజన్ ప్రారంభమైంది. పంటలు బాగా పండాలంటే సాగు నీటితో పాటు ఎరువులూ కీలకమే. సకాలంలో ఎరువులు వినియోగించకపోతే పంట ఎదుగుదల, దిగుబడి నాణ్యతపై ప్రభావం చూపుతాయి. అయితే రైతు సేవా కేంద్రాల్లో ఎరువుల కొరత ఉండటంతో ప్రైవేటు ఎరువుల దుకాణాల యజమానులు రైతుల అవసరాన్ని ఆసరాగా తీసుకొని దోపిడీ చేస్తున్నారు.

- ఖరీఫ్ ప్రారంభమైనా రైతు సేవా కేంద్రాల్లో ఎరువు నిల్వలు కరువు
- రైతులను దోపిడీ చేస్తున్న ప్రైవేట్ ఎరువుల దుకాణాలు
- పట్టించుకోని అధికారులు


పంట సాగుకు దుక్కులు చేసుకుంటున్న రైతు

అగళి: మడకశిర నినియోజవర్గంలోని 5 మండడలాల్లో 71 రైతు సేవా కేంద్రాలు ఉన్నాయి. అందులో 30 సేవా కేంద్రాల్లో ఎరువుల అంతంత మాత్రం ఉన్నాయి. 40 రైతు సేవా కేంద్రాల్లో గత మూడు నెలలుగా అసలు ఎరువులే లేవు. కొందరు వ్యాపారులు కృత్రిమ ఎరువుల కొరత సృష్టించి రైతులను దోపిడీ చేస్తున్నారు. అన్నదాతల అవసరాన్ని, నిస్సహాయతని ఆసరాగా తీసుకొని నకిలీ విత్తనాలు, నకిలీ ఎరువులను అంటగటే అవకాశం కూడా లేకపోలేదు. విత్తన చట్టం ఉన్నా ఎక్కడా అమలు కావడం లేదని అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎరువులు ప్రైవేటుగా కొంటుండటంతో సాగు పెట్టుబడి ఖర్చులు పెరిగిపోతున్నాయని చెబుతున్నారు.

సీజన్ ప్రారంభమైనా..

ఇటీవల కొన్ని మడకశిర నియోజకవర్గంలోని మండలాల్లో విస్తారంగా వర్షాలు కురిశాయి. బోర్ల కింద ముందస్తుగా రైతులు సేద్యం పనులను ముమ్మరం చేశారు. బోర్ల కింద పత్తి, దోసకాయ తదితర విత్తనాలు నాటారు. రైతు సేవా కేంద్రాల్లో ఎరువులు కొనుగోలు చేయాలని వెళితే నిల్వలేవని సిబ్బంది చెబుతుండటంతో నిరాశగా వెనుతిరుగుతున్నారు. జిల్లాలోని 416 రైతు సేవా కేంద్రాలు ఉన్నాయి. వాటిలో ఎరువుల కొరత ఉండటంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. కొన్ని కేంద్రాల్లో మాత్రమే పొటాష్ , జిప్సమ్ అందుబాటులో ఉంచారు. మరికొన్ని కేంద్రాల్లో వాటితో పాటు మిగిలిన ఎరువులు 30 శాతం మాత్రమే అందుబాటులో ఉన్నాయి. వర్షాలు కురుస్తుండడంతో జిల్లాలోని రైతులు వేరుశనగ, ఇతర ఆరుతడి పంటల సాగుకు సన్నద్ధమవుతున్నారు. రైతులకు ప్రభుత్వం అందించే సబ్సిడీ ఎరువులు అందుబాటులో లేకపోవడంపై అన్నదాతలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో ఖరీఫ్ సీజన్ ప్రారంభానికి ముందే అన్ని రైతు భరోసా కేంద్రాల్లో ఎరువులను రైతులకు అందుబాటులో ఉంచేవారని గుర్తు చేస్తున్నారు.

రెచ్చిపోతున్న ప్రైవేటు వ్యాపారులు

రైతుల అవసరాన్ని ఆసరాగా చేసుకుని ప్రైవేటు వ్యాపారులు దోపిడీకి పాల్పడుతున్నారు. యూరియా బస్తా ధర రూ.270 ఉండగా రూ.350 నుంచి 380 వరకూ అమ్ముతున్నారు. అలాగే డీఏపీ బస్తా ధర రూ..1360 ఉండగా రూ.1500 నుంచి 1550 వరకూ, కాంప్లెక్స్ ధర రూ.1470 ఉండగా రూ.1600 , 20.20.0.13 ధర రూ.1200 ఉండగా రూ.1320 వరకూ గిరాకీని బట్టి తీసుకుంటున్నారు. మిగతా రకాలకు కూడా అధికంగా వసూలు చేస్తున్నారు. ఈ దందాపై అధికారులకు రైతులు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని అంటున్నారు.

అధిక ధరలు పెట్టి కొంటున్నాం



ప్రైవేట్ ఎరువుల దుకాణాల్లో ఎరువులను అధిక ధరలకు విక్రయిస్తున్నారు. అసలే పండించిన పంటలకు మార్కెట్లో గిట్టుబాటు ధరలు లేవు. మరోవైపు ఎరువుల దుకాణాలలో ఇష్టానుసారంగా ఎక్కవ ధరలకు అమ్ముతూ రైతుల్ని దోచుకుంటున్నారు. ఎరువు కోసం మా గ్రామం నుంచి మండల కేంద్రానికి వెళ్లి తీసుకోవాలి. వ్యయ ప్రయాసలు పడుతున్నాం. ప్రభుత్వం ఎరువులను అందుబాటులో ఉంచాలి.

– నరసింహరాజు, అగళి

ఎరువులు అందుబాటులో లేవు



గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో రైతు భరోసా కేంద్రాల ద్వారా సమృద్ధిగా ఎరువులు అందేవి. అయితే ఇప్పుడున్న రైతు సేవా కేంద్రాల్లో ఎరువులు అందుబాటులో లేవు. ఖరీఫ్ సీజన్ పంటలు సాగు చేసుకోవడానికి అన్ని ఏర్పాట్లు చేసుకుంటున్నాం. అవసరమైన అన్ని రకాల ఎరువులు అందుబాటు ఉంటే రైతులకు ఎంతో మేలు జరుగుతుంది. ప్రభుత్వం ఆ దిశగా చర్యలు తీసుకొని రైతులను ఆదుకోవాలి.

– మంజునాథ్, రామపురం, అగళి మండలం

క్లుప్తంగా

భూసమస్యలపై గ్రామసభ


భూ సమస్యలపై గ్రామసభ నిర్వహిస్తున్న దృశ్యం

గోరంట్ల: మండల పరిధిలోని బూదిలి సచివాలయంలో బుధవారం పుట్టపర్తి రెవెన్యూ డివిజనల్ ఆఫీసర్ సువర్ణ ఆధ్వర్యంలో భూసమస్యలపై గ్రామ సభ నిర్వహించారు. గ్రామ సభలో బూదిలి, మల్లాపల్లి , మందలపల్లి రెవెన్యూ గ్రామల పరిధిలోని రైతులు, ప్రజలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల పరిధిలో నెలకొన్న భూ సమస్యలను ఆర్‌డీఓ సువర్ణ పరిశీలించి వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని తహసీల్దార్ మారుతిని ఆదేశించారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల వీఆర్‌ఓలు, రైతులు పాల్గొన్నారు.

ఉపాధి పనులపై సమీక్ష


మాట్లాడుతున్న ఎంపీడీఓ రామారావు

అమరాపురం: స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో బుధవారం ఉపాధి పనులపై ఎంపీడీఓ రామారావు ఆధ్వర్యంలో సమీక్ష సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఎంపీడీఓ మండలంలోని వివిధ గ్రామాల్లో చేపట్టిన పనుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. అలాగే కూలీల సంఖ్య పెంచాలని సూచించారు. రోజు ఎంత మంది కూలీలు వస్తున్నారు. వారికి బిల్లులు అందించారా లేదా అని ఆరా తీశారు. అనంతరం మస్టర్, రికార్డులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఏపీఓ, టీఏలు, ఎఫ్ఏలు పాల్గొన్నారు.

లేపాక్షిలో 38.4 మి.మీ వర్షం

హిందూపురం: పెనుకొండ రెవెన్యూ డివిజన్ వ్యాప్తంగా మంగళవారం రాత్రి వర్షం కురిసింది. అత్యధికంగా హిందూపురం నియోజకవర్గంలోని లేపాక్షి మండలంలో 38.4 మి.మీ వర్షపాతం నమోదైంది. చిలమత్తూరులో 32.8, హిందూపురంలో 26.4, పరిగిలో 22.6, రొద్దంలో 21.6, మడకశిరలో 3,0, సోమందేపల్లిలో 2.4 మి.మీతో కలిపి డివిజన్ వ్యాప్తంగా మొత్తం 149.2 మి.మీ వర్షపాతం నమోదైంది. అలాగే సగటు వర్షపాతం 12.4గా నమోదు అయినట్లు రెవెన్యూ అధికారులు తెలిపారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం


కాటికాపరి కుటుంబానికి ఆర్థిక సహాయం అందిస్తున్న కమిటీ సభ్యులు

హిందూపురం: బ్రాహ్మణ రుద్రభూమిలో కాటికాపరిగా ఉంటూ ఇటీవలే మృతి చెందిన శీనప్ప కుటుంబానికి బ్రాహ్మణ రుద్ర భూమి కమిటీ సభ్యులు రూ.50 వేలు ఆర్థిక సహాయం అందించారు. బాధిత కుటుంబానికి తమవంతు సహకారం అందిస్తామన్నారు. కార్యక్రమంలో బ్రాహ్మణ రుద్ర భూమి కమిటీ అధ్యక్షుడు పాండురంగారావు, కోశాధికారి శివరామకృష్ణ, సభ్యులు ఫణి గోపాల్, దత్తాత్రేయ, సత్య తదితరులు పాల్గొన్నారు.

వలసలు నివారించేందుకు చర్యలు

రొళ్ల: గ్రామాల్లో జాబ్‌కార్డులు కలిగిన కూలీలకు ఉపాధి అవకాశాలు కల్పించి వలసలు నివారించడానికి చర్యలు తీసుకోవాలని ఏపీఓ ఓబుళప్ప పేర్కొన్నారు. బుధవారం మధ్యాహ్నం స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయం సమావేశ మందిరంలో ఉపాధి సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏపీఓ మాట్లాడుతూ 2025–26 సంవత్సరానికి మెట్ట ప్రాంతాల్లో పండ్లతోటల పెంపకానికి ఆసక్తి ఉన్న రైతులచే దరఖాస్తులు స్వీకరించి మంజూరు కోసం ప్రతిపాదనలు పంపాలన్నారు. కార్యక్రమంలో ఉపాధి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

గుండెపోటుతో యువకుడి మృతి


లోకేష్ (ఫైల్)

అగళి: గుండెపోటుతో లోకేష్ (39) మృతిచెందిన సంఘటన మండల పరిధిలోని ఆలూడిలో బుధవారం చోటుచేసుకుంది. కుటుంబ సభ్యుల వివరాల మేరకు .. పశువులకు మేత తీసుకొచ్చేందుకు పోలానికి వెళ్లి పచ్చి గడి కోస్తుండగా గుండె నొప్పి రావడంతో అక్కడికక్కడే మృతి చెందాడన్నారు. మృతుడికి భార్య భాగ్యమ్మ, ముగ్గురు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. కుటుంబాన్ని ఆదుకోవాలని గ్రామస్తులు ప్రభుత్వాన్ని కోరారు.

జర్నలిస్టుల సమస్యలు పరిష్కరించండి


ఏఓ గిరిధర్‌నాయక్‌కు వినతిపత్రం ఇస్తున్న జర్నలిస్టులు

పెనుకొండ రూరల్: జర్నలిస్టుల సమస్యలు పరిష్కరించాలని ఏపీడబ్ల్యూజేఎఫ్ ఆధ్వర్యంలో జర్నలిస్టులు ఆర్డీఓ కార్యాలయ ఏఓ గిరిధర్‌నాయక్‌కు వినతిప్రతం ఇచ్చారు. ఈ సందర్భంగా జర్నలిస్టులు మాట్లాడుతూ జర్నలిస్టుల కోసం హౌసింగ్ కార్పొరేషన్ ఏర్పాటు చేయాలన్నారు. ప్రతి విలేకరికి 3 సెంట్ల ప్రభుత్వ స్థలం కేటాయించాలన్నారు. ఇంటి నిర్మాణానికి ప్రభుత్వం ఆర్థిక సాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఏపీడబ్ల్యూజేఎఫ్ ఉమ్మడి జిల్లా ఉపాధ్యక్షుడు నవీన్ కుమార్, నియోజకవర్గ అధ్యక్షుడు జాకీర్ హుస్సేన్, మల్లికార్జున, హరి, మురళీ, మూర్తి, రఘు, తదితరలు పాల్గొన్నారు.

హిందూపురం: జర్నలిస్టులు ఎదుర్కొంటున్న సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని హిందూపురం ప్రెస్‌క్లబ్ జర్నలిస్టులు కోరారు. బుధవారం ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో తహసీల్దార్ ఆఫీసు వద్ద ధర్నా చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న మూడు సెంట్ల భూమి అర్హులైన పేద జర్నలిస్టులందరికీ ఇవ్వాలని కోరారు. జర్నలిస్టులకు ఉద్యోగ భద్రత కల్పించి దాడులు జరగకుండా కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం తహసీల్దార్ వెంకటేశుకు వినతిపత్రాన్ని అందించారు. కార్యక్రమంలో నాయకులు షబ్బీర్, గంగప్ప, రమేష్, రాజేష్, ప్రకాష్, అల్లిపీరా, అంజన మూర్తి, శివ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పంటల సాగులో వైవిధ్యాన్ని ప్రోత్సహించాలి


పోస్టర్లు విడుదల చేస్తున్న దృశ్యం

పరిగి: పంటల సాగులో రైతులు వైవిధ్యం కలిగి ఉండేలా ప్రోత్సహించాలని కృషి విజ్ఞాన కేంద్రం ఎస్ఎంఎస్ క్రాప్ ప్రొడక్షన్ ప్రతినిధి మల్లికార్జున, వెటర్నరీ సైంటిస్ట్ డాక్టర్ హరిణి తెలిపారు. మండలంలో బుధవారం ఊటుకూరు, ఎర్రగుంట, హొన్నంపల్లి గ్రామాలలో వికసిత్ కృషి సంకల్ప అభియాన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. వారు మాట్లాడుతూ ప్రధాన మంత్రి మోదీ ప్రభుత్వం రైతుల సాంకేతిక పరిజ్ఞానం పెంపొందించాలన్న లక్ష్యంతో వికసిత్ కృషి సంకల్ప అభియాన్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారన్నారు. నూతన వంగడాలు, డ్రోన్ స్ప్రేయింగ్ తదితర అంశాలపై అవగాహన కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సైంటిస్ట్ ఆఫ్ అగ్రనమీ ప్రతాప్, హార్టికల్చర్ సైంటిస్ట్ యోగేందర్, ఏఓ విజయభారతి, ఏఈఓ నాగవేణి, రైతు సేవా కేంద్రాల సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్ఐగా పదోన్నతి

చిలమత్తూరు: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న నేలకోటప్ప ఆర్ఐగా పదోన్నతి పొందారు. ఆయన చిలమత్తూరు మండలంలోనే ఆర్ఐగా కొనసాగనున్నారు. ఈ సందర్భంగా నేలకోటప్పకు డీటీ జగన్నాథ్, రెవెన్యూ సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు.

విత్తన వేరుశనగ పంపిణీ

పరిగి/రొద్దం: పరిగి, రొద్దం మండలాల వ్యాప్తంగా అన్ని రైతు సేవా కేంద్రాల్లో సబ్సిడీ విత్తన వేరుశనగ పంపిణీ ప్రారంభించినట్లు ఏఓలు విజయభారతి, నివేదిత తెలిపారు. సబ్సిడీ ధర పోనూ ఒక బస్తాకు రూ.1674 ధరతో అందిస్తున్నట్లు పేర్కొన్నారు. రిజిస్ట్రేషన్ చేయించుకున్న ప్రతి రైతుకు అందిస్తున్నామన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి


మాట్లాడుతున్న సీహెచ్ఓ వన్నప్ప

పరిగి: సీజనల్ వ్యాధులపై వైద్యారోగ్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని పీహెచ్‌సీ కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ వన్నప్ప తెలిపారు. మండలంలోని శ్రీరంగరాజుపల్లిలో బుధవారం మలేరియా, టీబీ వ్యాధులపై అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ వర్షాల కారణంగా గ్రామాల్లో నీటి నిల్వలు లేకుండా ప్రజలను అప్రమత్తం చేయాలన్నారు. మురుగు నీటి వల్ల రోగ కారక క్రిములు, దోమలు వృద్ధి చెంది రోగాలకు కారణమవుతాయన్నారు. టీబీ లక్షణాలున్నట్లు ఉంటే వెంటనే వైద్య పరీక్షలను చేయించుకోవాలన్నారు. కార్యక్రమంలో లక్ష్మీకాంత్, ఏఎన్ఎం పుష్పలత, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

కంప చెట్లు తొలగించండి


ఛత్రం రోడ్డుకు ఇరువైపుల పెరిగిన కంప చెట్లు

మడకశిరరూరల్: మండల పరిధిలోని చీపులేటి నుంచి ఛత్రం గ్రామానికి వెళ్లే రోడ్డులో ఇరువైపుల పెరిగిన కంపచెట్ల పెరిగాయి. రాత్రి సమయంలో ప్రజలు, వాహనదారులు ఈ దారి గుండా వెళ్లేందుకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఎదురుగా ట్రాక్టర్ వస్తే పక్కకు వెళ్లడానికి కూడా వీలు లేకపోయిందని వాహనదారులు వాపోతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు చర్యలు తీసుకొని రోడ్డుకు ఇరువైపులా పెరిగిన కంప చెట్లను తొలగించాలన్నారు.

కూలిన చెట్టు తొలగించరా?


రొళ్ల లక్ష్మీనరసింహస్వామి ఆలయం వద్ద కూలిపోయిన చెట్టు

రొళ్ల: మండల కేంద్రం లక్ష్మీనరసింహస్వామి ఆలయానికి ఎదురుగా ఉన్న చెట్టు కూలీ నెలరోజులు కావస్తోంది. అయితే అప్పటి నుంచి నేటికీ ఆ చెట్టును తొలగించకపోవడంతో భక్తులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రోడ్డుకు అడ్డంగా ఉన్న చెట్టును తొలగించకపోవడంతో అటుగా వెళ్లాలంటే అవస్థలు పడాల్సిన పరిస్థితి. కనీసం రోడ్డు పై పడిన చెట్టు కొమ్మలు కోసి పక్కకు జరిపినా సరిపోతుందని భక్తులు చెబుతున్నారు. అయితే నేటికీ ఆలయ కమిటీ సభ్యులు మాత్రం పట్టించుకపోవడం గమనార్హం.

రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన


రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభిస్తున్న మంత్రి సవిత

పరిగి: మండలంలోని తిరుమలదేవరపల్లి, యాబసవనపల్లి గ్రామాలకు వెళ్లే రోడ్డు నిర్మాణ పనులను మంత్రి సవిత బుధవారం శంకుస్థాపన చేశారు. అనంతరం భూమి పూజ చేసి పనులు ప్రారంభించారు. మంత్రి మాట్లాడుతూ పరిగి మండలంలో రూ.3.10 కోట్లతో రోడ్ల నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశామన్నారు. ఇందులో పరిగి నేషనల్ హైవే నుంచి బసవనపల్లికి వెళ్లే రోడ్డు నిర్మాణానికి రూ. 2.10 కోట్లు, తిరుమలదేవరపల్లి వెళ్లేందుకు రూ.కోటి వ్యయంతో రోడ్లు వేస్తున్నామన్నారు.

రాష్ట్రీయ కిసాన్ సంఘం అధ్యక్షుడిగా నాగరాజు



పావగడ: స్థానిక రాష్ట్రీయ కిసాన్ సంఘం తాలూకా అధ్యక్షుడిగా నేరళకుంటి నాగరాజు నియమితులయ్యారు. స్థానిక అతిథి గృహంలో బుధవారం జరిగిన కార్యక్రమంలో రాష్ట్రీయ కిసాన్ సంఘం రాజ్యాధ్యక్షుడు డా వి నాగభూషణరెడ్డి ఆధ్వర్యంలో నూతన పదాధికారుల ఎంపిక జరిగింది. ప్రధాన కార్యదర్శిగా వెంకట్రామిరెడ్డి, ఉపాధ్యక్షుడిగా ఏ కృష్ణప్ప, సభ్యులుగా వెంకటరెడ్డి, ఈశ్వరప్ప, ఎస్‌పి నారాయణప్ప, నాగేశ్, చంద్రప్ప, వివిఎస్ విజయకుమార్, జగన్నాథ్, పాపణ్ణ, లక్ష్మీనరసింహప్ప, బీహెచ్ కృష్ణమూర్తి, ఎం లింగప్ప, శ్రీనివాసప్పలను ఎంపిక చేశారు.

పాఠశాలలకు చేరిన కిట్లు

మడకశిర: మండలంలోని విద్యార్థులకు ఈ విద్యా సంవత్సరంలో అందించడానికి అవసరమైన కిట్లను ఆయా పాఠశాలలకు చేర్పించినట్లు ఎంఈఓ శ్రీనివాస్‌భాస్కర్ ఒక ప్రకటనలో తెలిపారు. అలాగే మధ్యాహ్న భోజనానికి అవసరమైన సన్న బియ్యాన్ని కూడా పాఠశాలలకు అందించామన్నారు.

పెట్టె అంగడి దగ్ధం


అంగడిలో వస్తువులు కాలిపోయిన దృశ్యం

పావగడ: తాలూకాలోని సుంకార్లకుంట గ్రామంలో మంగళవారం రాత్రి పెట్టె అంగడిలో దీపం పెట్రోల్‌కు తగిలి అంగడి దగ్ధమైంది. పెట్రోల్ క్యాన్ నుంచి మరో క్యాన్‌లోకి పెట్రోల్ పోస్తుండగా వెలిగించి ఉన్న దీపం పెట్రోల్‌కు తగిలి ఈ ఘటన జరిగినట్లు స్థానికులు తెలిపారు.ప్రమాదంలో అంగడి యజమాని నారాయణప్ప తీవ్రంగా గాయపడగా ఆస్పత్రికి తరలించారన్నారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

జూద కేంద్రంపై దాడి

రొళ్ల: మండల పరిధిలోని జీరిగేపల్లి పొలిమేరలో జూద కేంద్రంపై దాడి చేసినట్లు బుధవారం ఎస్ఐ వీరాంజనేయులు తెలిపారు. నలుగురు జూదరులను అరెస్ట్ చేసి వారి వద్ద నుంచి రూ.11,740ను స్వాధీనం చేసుకున్నామన్నారు. గ్రామాల్లో అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు తప్పవని హెచ్చరించారు. త్వరలోనే జూదారులను మడకశిర కోర్టులో హాజరు పరుస్తామన్నారు.

ఈ-కేవైసీ చేయించుకోండి

మడకశిర: మండలంలో ఇంకా వేలాది మంది రైతులు ఈ-కేవైసీ చేయించుకోలేదని మండల వ్యవసాయశాఖ అధికారి తిమ్మప్ప ఒక ప్రకటనలో తెలిపారు. దాదాపు 11 వేల మంది రైతులు ఈ-కేవైసీ చేయించుకోవాల్సి ఉందన్నారు. వీరందరూ జాప్యం చేయకుండా ఈ-కేవైసీని చేయించుకోవాలని సూచించారు. లేకపోతే ప్రభుత్వం అందించే పథకాలు అందవన్నారు. ప్రధానంగా అన్నదాత సుఖీభవ పథకం కింద సాయం అందదని చెప్పారు. ఈ విషయాన్ని గుర్తించి ఈ-కేవైసీ పూర్తి చేసుకుని సహకరించాలని కోరారు.

శాస్త్రీయ సమాజ నిర్మాణానికి జేవీవీ కృషి


పోస్టర్లు విడుదల చేస్తున్న జేవీవీ సభ్యులు

హిందూపురం: ప్రజల్లో శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించడంతో పాటు నిత్యజీవితంలో ప్రజలు ఎదుర్కొంటున్న అనేక సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని జేవీవీ కార్యదర్శి డాక్టర్ ఈటీ రాంమూర్తి అన్నారు. బుధవారం చైతన్యనగర్‌లో జేవీవీ సభ్యత్వ పోస్టర్లు విడుదల చేశారు. కార్యక్రమంలో జేవీవీ సభ్యులు ప్రమీల, రామకృష్ణ, నారాయణస్వామి, ఉగ్రప్ప, రామకృష్ణ, అబ్దుల్ హక్, రియాజ్ ఖాన్, వెంకటలక్ష్మి, ఓబులేసు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ చర్యలపై కార్మిక లోకం ఆగ్రహం

- ఏపీ షాప్స్ ఎస్టాబ్లిష్‌మెంట్ చట్ట సవరణకు రాష్ట్ర ప్రభుత్వం యత్నం
- కూటమి ప్రభుత్వ నిర్ణయాలతో అధిక ఒత్తిడి తప్పదని కార్మికుల ఆవేదన
- శ్రామికుల కష్టాన్ని దోపిడీ చేయడమేంటని కార్మిక సంఘాల ఆగ్రహం

హిందూపురం: కూటమి ప్రభుత్వ నిర్ణయాలపై కార్మిక లోకం ఆగ్రహం వ్యక్తం చేస్తోంది. ఇప్పటికే పని గంటలను పది గంటలకు పెంచిన ప్రభుత్వం తాజాగా చిరుద్యోగుల నోట్లో మట్టికొట్టేందుకు సిద్ధమైంది. చిరు ఉద్యోగుల హక్కులను సవరించి ఏపీ షాప్స్ ఎస్టాబ్లిష్‌మెంట్ చట్టం–1988 సవరించడానికి పూనుకోవడంపై కార్మిక సంఘాలు, కార్మికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. చట్ట సవరణతో శ్రమదోపిడీని మరింతగా ప్రోత్సహించినట్టేనని అంటున్నారు. జిల్లాలో ఒక్క హిందూపురం పారిశ్రామికవాడలో 155 దాకా కంపెనీలు ఉన్నాయి. ఇవి కాక చిన్నా చితక కంపెనీలు ఎన్నో ఉన్నాయి. ఇందులో దాదాపుగా 23 వేల మందికి పైగా కార్మికులు పనిచేస్తున్నారు.

చిన్న సంస్థలపై జోక్యం చేసుకోలేరు



ఏపీ షాప్స్ ఎస్టాబ్లిష్‌మెంట్ చట్టాన్ని సవరణ చేస్తే చిన్న సంస్థలపై కార్మికశాఖ ఎలాంటి చర్యలు తీసుకోలేదు. అసలు కన్నెత్తి చూసే పరిస్థితి ఉండదు. దీనవల్ల కార్మికులకు ఎలాంటి ప్రయోజనం ఉండదు. సంస్థ యాజమాని ఎన్ని గంటలు ఉండమంటే అన్ని గంటలు పనిచేయాలి. ఉద్యోగులకు వెట్టి చాకిరీ తప్పదు.

– చంద్రకళ, కార్మికురాలు

చిరుద్యోగుల హక్కులను కాలరాస్తారా?



ప్రభుత్వం తీసుకుంటున్న నిర్ణయాలతో చిరుద్యోగుల హక్కులను కాలరాస్తున్నారే తప్ప ఏమాత్రం మేలు చేయడం కాదు. 20 మంది పని వాళ్ల ఉన్న సంస్థలను కార్మిక శాఖ పరిధిలో రాకుండా చేయడమేంటి. ఇది కచ్చితంగా కార్మికులకు మేలు చేసే నిర్ణయం కాదు. ఫ్యాక్టరీ, సంస్థలు చెప్పే మాటలే వేదంలా మారతాయి. ఇలాంటి నిర్ణయాలను క్యాబినెట్‌లో ఆమోదించకూడదు.

– అనిత, కార్మికురాలు, సంతేబిదనూర్

వేతనాలు పెంచాలని చట్టాలు చేయండి



శ్రామికుల కష్టాన్ని దోపిడీ చేయడానికి ప్రభుత్వమే ప్రోత్సహించేలా చట్టాలు చేయడం దారుణం. ఇప్పటికే పరిశ్రమలు ఇతర చోట్ల కార్మికులచే గంటల తరబడి ఉడిగం చేస్తున్నారు. దీనికితోడు ఇలాంటి పని దోపిడీ చట్టాలు వస్తే కార్మికుల రక్తాన్ని పీలుస్తారు. ఏపీ షాప్స్ ఎస్టాబ్లిష్‌మెంట చట్టం–1988 సవరించాలన్న నిర్ణయం సరికాదు. కార్మికులకు వేతనాలు పెంచాల్సిందేనని చట్టాలు చేయండి.

– రవికుమార్,
తూమకుంట కార్మిక సంఘం అధ్యక్షుడు, హిందూపురం

వెట్టిచాకిరీకి దారి చూపుతున్నారు



ఇప్పటికే పరిశ్రమలు ఇతర సంస్థలలో కార్మికులచే 12 గంటలు వెట్టి చాకిరీ చేయిస్తున్నారు. ఉదయం 9 గంటలకు పనులకు వెళ్తే రాత్రి 9 గంటల వరకూ పనులు చేయిస్తున్నారు. చట్టాల సవరణతో కార్మికులు రాత్రంతా పనులు చేయడానికే సరిపోతుంది.

–పి.బాబు, కార్మిక సంఘం ఉపాధ్యక్షుడు, తూమకుంట

డివిజన్‌స్థాయి యోగాంధ్రపై సమీక్ష


మాట్లాడుతున్న ఆర్డీఓ ఆనంద్‌కుమార్

పెనుకొండ రూరల్: ఈనెల 16నన నిర్వహించే డివిజన్‌స్థాయి యోగాంధ్ర కార్యక్రమంపై ఆర్డీఓ ఆనంద్ కుమార్ డివిజన్, మండల అధికారులతో బుధవారం సమీక్ష సమావేశం ఏర్పాటు చేశారు. కియా పరిశ్రమ పరిసరాల్లో 16న ఉదయం 6 గంటల నుంచి 8 గంటలకు యోగాంధ్ర కార్యక్రమం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఉద్యోగులు, విశ్రాంత ఉద్యోగులు, వివిద సంస్థలకు చెందిన వారు పెద్ద ఎత్తున హాజరై విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీధర్, ఎంపీడీఓ నరేష్‌కృష్ణ, సీఐ రాఘవన్ తదితర అధికారులు పాల్గొన్నారు.